ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం



దెక్కతిపాలెంలో పేషెంట్లకు మందులు, కేస్ షీట్లు అందిస్తున్న జెడ్సీ రాము, జీరు వెంకటరెడ్డి



ఆరోగ్య సురక్ష శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న పీఎం పాలెం వాసులు

- అదే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం
- భీమిలి జెడ్సీ రాము
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన

తగరపువలస: రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని భీమిలి జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు. భీమిలి చినబజారు వార్డు సచివాలయం ఆధ్వర్యంలో బుధవారం రెండో వార్డు దెక్కతిపాలెంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని ప్రజలంతా ఉచిత వైద్య సేవలను వినియోగించుకునేలా వలంటీర్లు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పనిచేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి వారిని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్సకు సిఫారసు చేయాలని సూచించారు. జీరు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. వైద్య శిబిరాల్లో పరీక్షలు చేయించుకోవడం అనారోగ్య సమస్యలకు చికిత్స చేయించుకుని ఉపశమనం పొందవచ్చన్నారు. అనంతరం రోగులకు కేస్‌షీట్లు, మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 540 మంది పరీక్షలు చేయించుకోగా.. వీరిలో 32 మందికి కళ్లద్దాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఉపాధ్యక్షుడు శిల్లా వంశీరెడ్డి, కొండపు సూరిబాబు, చిల్ల సూరి,

426 మందికి వైద్య పరీక్షలు

పీఎం పాలెం: స్థానిక డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సుజాన్ పల్లా పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో పీఎం పాలెం చుట్టుపక్కల కాలనీల్లో నివసిస్తున్న సుమారు 426 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఉచితంగా బీపీ, సుగర్, నేత్ర తదితర వైద్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు సరఫరా వంటి కార్యక్రమాలు చేపట్టిన జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నామన్నారు. 248 మంది మహిళలకు వైద్య పరీక్షలు, 25 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారి సుజాన్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ వర్మ, డాక్టర్ సందీప్ శ్రీనివాస్, డాక్టర్ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారాలకు పండగ ఎఫెక్ట్



నిర్మానుష్యంగా బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ కూడలి



మూతపడిన ప్రధాన రహదారిలోని దుకాణాలు



వెలవెలబోయిన తాతా థియేటర్ డౌన్ రోడ్

తగరపువలస: ముక్కనుమ ఎఫెక్ట్‌తో బుధవారం భీమిలి జోన్‌లో వ్యాపారాలు దాదాపు మూతపడి రహదారులపై జనసంచారం లేక బోసిపోయాయి. మధ్యాహ్నం వరకు మటన్, చికెన్ దుకాణాలు సందడిగా కనిపించాయి. కేవలం సినిమా థియేటర్లు మాత్రమే ప్రేక్షకులతో నిండిపోయాయి. పాక్షికంగా పాన్‌షాపులు తెరచుకున్నాయి. మోటారు వాహనాల షోరూమ్‌లు తెరచుకోగా మెకానిక్‌లు, టైర్ వర్క్స్, కిరాణా, దుస్తుల దుకాణాలు, శానిటరీ, ఫ్యాన్సీ, హోటళ్లు, జ్యూస్ షాపులు మూతపడ్డాయి. ప్రైవేట్ మార్కెట్ కూడా వెలవెలబోయింది. హోల్‌సేల్ వ్యాపారాలు తెరవలేదు. విద్యా సంస్థలకు కూడా సెలవుల కారణంగా ఎక్కడా రహదారులపై జన ప్రభావం కనిపించలేదు. మధ్యాహ్నం వరకు బస్సులు ఖాళీగా తిరగ్గా.. ఆటోలు, ఇతర మోటారు వాహనాలు రోడ్డెక్కలేదు.

ఘనంగా కోదండరాముడి తీర్థం



పూజలందుకున్న కోదండరాముడు



పరసలో దుకాణాల వద్ద జనం సందడి

మధురవాడ: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతలకు గుడి కట్టి పూజలు చేయడమే కాదు.. తీర్థాలు కూడా నిర్వహిస్తున్నారు. ఇలాంటి వాటిల్లో మధురవాడ బక్కన్నపాలెం రోడ్డులోని కోదండరాముడి ఆలయం ఒకటి. కనుమ మరుసటి రోజు తీర్థం నిర్వహించడం వందల ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా బుధవారం కోదండరాముడి తీర్థం ఘనంగా నిర్వహించారు. అప్ బ్రిడ్జి వద్ద బక్కన్నపాలెం రోడ్డులో వెలసిన శ్రీ గణపతి సాయినాథ సమేత కోదండరామ ఆలయం స్వామికి నూతన వస్త్రాలు సమర్పించి విశేషంగా అలంకరించారు. స్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఈ ఆలయానికి వర్రిరాజు కృష్ణకుమారి కుటుంబీకులు అనువంశిక ధర్మకర్తలు. మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విశేషంగా తరలి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రంలో పరసలో ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద సందడి చేశారు.

క్లుప్తంగా

ముక్కనుమతో ముగిసిన సంక్రాంతి సంబరాలు



ఆదర్శనగర్ అపార్టుమెంట్ వద్ద గంగిరెద్దుకు పూజలు చేస్తున్న స్థానికులు

తగరపువలస: సంక్రాంతి సంబరాలు బుధవారం నాటి ముక్కనుమ పండగతో ఘనంగా ముగిశాయి. చివరిరోజు పలుచోట్ల పశువులను నదులు, చెరువుల్లో శుభ్రం చేసి అలంకరించి పూజలు చేశారు. వాటికి దాణా, పిండివంటలు సమర్పించారు. పట్టణ ప్రాంతాల్లో గంగిరెద్దులకు దుస్తులు సమర్పించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. బంధువులతో కలిసి ముక్కనుమను విందు వినోదాలతో సందడిగా జరుపుకున్నారు. పండగ ముగియడంతో చాలా వరకు సాయంత్రం నుంచే స్వస్థలాలకు తిరుగు పయనమయ్యారు.

వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలకు ఆహ్వానం

తగరపువలస: ఈ నెల 23న ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు తెలుగు, హిందీ మాధ్యమాల్లో వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నారు. సుభాష్ చంద్రబోస్ జీవిత విశేషాలపై వ్యాసరచన, స్వాతంత్ర్య సముపార్జనలో అతివాదుల పాత్రపై ఉపన్యాస పోటీలు, దేశభక్తి ప్రేరేపిత చిత్రాలపై చిత్రలేఖనం పోటీలు జరుగుతాయి. విజేతలకు 23వ తేదీన బహుమతులు అందించనున్నట్టు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. వివరాలకు 89858 97419, 89856 47419 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు కళేబరం



తిమ్మాపురం తీరంలో తాబేలు కళేబరం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం తీరం వద్దకు బుధవారం తాబేలు కళేబరం కొట్టుకుని వచ్చింది. ఇక్కడ మత్స్యకారులు దీనిని గమనించి వెళ్లి చూసేప్పటికి మృత్యువాత పడ్డట్లు తెలిపారు. సముద్రంలో పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో మత్స్య జీవరాశులు మృత్యువాత పడుతున్నట్లు చెప్పారు. ఇటీవల మంగమారిపేట బీచ్ వద్ద భారీ డాల్ఫిన్, తాబేలు కళేబరాలు, ఉప్పాడ వద్ద భారీ తాబేలు కళేబరం కొట్టుకొచ్చిన విషయం తెలిసిందే. వరుస సంఘటనలతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా బావి



పాండ్రంగిలో సిమెంటు రోడ్డును ఆనుకుని ఉన్న బావి

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో రోడ్డును ఆనుకుని బావి సమాంతరంగా ఉంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పాండ్రంగి నుంచి సామయ్యవలస వెళ్లే రోడ్డును ఆనుకుని ఈ బావి ఉంది. దీని నుంచి స్థానికులు వాడుకుల కోసం నీరు తోడుతుంటారు. ఐదేళ్ల కిందట సిమెంటు రోడ్డు వేయడంతో ఈ బావి ఒక పక్కంతా రహదారికి సమాంతరమైంది. ఈ రోడ్డుపై లారీలు వంటి పెద్ద వాహనాలు ఎదురుగా వచ్చేటప్పుడు వీటిని తప్పించేందుకు పక్కకు వెళ్లే ప్రయత్నంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు బావిలో పడి ప్రమాదాలు జరిగే అవకాశముంది. చిన్న పిల్లలు బావి పరిసర ప్రాంతంలో ఆడేటప్పుడు బావిలో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బావి గోడ ఎత్తు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

22న ఓటర్ల జాబితా విడుదల

- నామినేషన్ తొలి రోజు వరకు నమోదుకు అవకాశం
- ఆర్డీవో, ఓటర్ల నమోదు అధికారి భాస్కరరెడ్డి



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితాను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ఆర్డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు నియోజకవర్గ పరిధిలో మొత్తం 3,51,462 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఇందులో పురుషులు 1,72,462 మంది, మహిళలు 1,78,958 మంది అని తెలిపారు. మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని, ఈ జాబితాను విడుదల చేసిన తరువాత రాజకీయ పార్టీల నాయకులతోపాటు, ఇతరులు కూడా పరిశీలించుకోవచ్చని పేర్కొన్నారు. ఇందులో తమ పేర్లు పరిశీలించుకోవడంతోపాటు ఏదైనా ఇబ్బందులు, పొరపాట్లు ఉంటే వాటిని గుర్తిస్తే సరి చేస్తామని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని, అభ్యర్థుల నామినేషన్లు వేసే తొలి రోజు వరకు నమోదుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అప్పటివరకు జాప్యం చేయకుండా మిగిలిన ఓటర్లు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆర్డీవో కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడానికి నాయకులు కూడా తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కంటుభుక్త రామానాయుడు, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



దుమ్మెద అప్పలసూరి

ఆనందపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన సామాజిక న్యాయ మహాశిల్పం, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మృతి వనం ఆవిష్కరణకు అందరూ తరలి రావాలని భీమిలి డివిజన్ ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడు దుమ్మెద అప్పలసూరి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఆనందపురంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 206 అడుగుల ఎత్తున ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం దేశానికే తలమానికంగా నిలుస్తుందని చెప్పారు. ఈ నెల 19న జరిగే ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం నేడు

పద్మనాభం: పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 18న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని అందరూ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

చంద్రంపాలెం వద్ద ఫుట్ బ్రిడ్జి నిర్మాణంపై హర్షం

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మధురవాడ జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చే 2 నెలల్లో రూ. 2.50 కోట్ల వ్యయంతో 50 అడుగుల పొడుగు, 10 అడుగుల వెడల్పు, 22 అడుగుల ఎత్తుతో బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టడం బాలల విజయమన్నారు. ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు జాతీయ రహదారిని దాటడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ క్రమంలో పలువురు ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారుల సంస్థ అధికారులతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జీవీఎంసీ అధికారులకు తమ కమిషన్ తరఫున లేఖలు రాశామన్నారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించడం హర్షణీయమన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి సహకరించిన వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విజేతలతో నాయకులు

ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెంలో శ్రీరమణమ్మతల్లి తీర్థ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. గ్రామంలోని యువతీ యువకులకు క్రికెట్, రన్నింగ్, కబడ్డీ, కుర్చీ ఆటలు నిర్వహించారు. విజేతలకు ఏఎస్‌పీ అనిల్‌కుమార్, ఏజీపీ మరుపిళ్ల చిన్నయ్యపాత్రుడు తదితరులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకుడు బావిశెట్టి రాజు, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు పోతిన వెంకట అప్పారావు, నాయకులు కూరాకుల వెంకటేష్, కూరాకుల మురళి, గుండు నానాజి, మరుపిళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ముగిసిన సంక్రాంతి సంబరాలు



కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామం(జాతర)లో సంక్రాంతి సంబరాలు ముగిశాయి. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం 6 గంటకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. నగరానికి చెందిన కూచిపూడి డాన్స్ అసోసియేషన్‌లో శిక్షణ పొందుతున్న బాల బాలికలు తమ అద్భుత నృత్య బంగిమలతో ఆకట్టుకున్నారు. దీక్షిత, వందన, సాహితి, భవ్య, యశ్విత ప్రియ, వేదిత ప్రియ, జోష్మిత, జాహ్నవి, శైలజ, కీర్తి, హర్షి, దీపు, హృద్య, పూజిత, శాన్వి, దీపిక, భవ్య, అనన్య, యోగిని, శైలు, తదితరులు సుమారు 30 మంది విద్యార్థులు మీనాక్షి దర్శకత్వంలో కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

పైప్‌లైన్ల లీకేజీతో చిత్తడిగా రోడ్డు





చిట్టివలస జెడ్పీ హైస్కూల్ పరిసరాల్లో చిత్తడిగా మారిన రహదారి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేట, చిట్టివలస పరిసర ప్రాంతాలలో తాగునీటి పైపుల నుంచి లీకేజీ కారణంగా తరచూ ఇక్కడి రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. తాగునీటి పంపింగ్, నీటి సరఫరా సమయంలో ధారలుగా ప్రవహిస్తున్న నీరు చిట్టివలస జెడ్పీ హైస్కూల్, బాలికల హైస్కూల్, శివాలయం, సంతోషిమాత ఆలయం, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం తదితర చోట్ల రోడ్లపై నిలిచిపోతుంది. లీకైన పైపుల కారణంగా ప్రవహించే నీరు డ్రైనేజీలలోకి చేరే మార్గం లేకపోడంతో సమీపంలో నివాస గృహాలు, స్కూల్ భవనాల వద్ద గోడల వరకు చేరి నిలిచిపోతుంది. ఇప్పటికైనా పైపులైన్ లీకేజీలు అరికట్టి చిత్తడి లేకుండా చూడాలని కోరుతున్నారు.

భీమిలిలో 22న శ్రీరామ శోభాయాత్ర



సీతారామ, లక్ష్మణులు

భీమునిపట్నం: ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా భీమిలిలో శ్రీరామ భక్తులందరూ శ్రీరామ శోభాయాత్ర చేయడానికి సంకల్పించారని యాత్ర నిర్వాహకులు బుధవారం తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు పెద్దబజారు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి యాత్ర ప్రారంభమవుతుందని, ఊరిలోని అన్ని రామాలయాలను దర్శించుకుంటామని చెప్పారు. చిరిలో నెహ్రూ ఉన్నత పాఠశాల వద్దనున్న రామాలయం వద్ద యాత్రను పూర్తి చేసి అక్కడ భక్తులందరికీ ప్రసాదం అందజేస్తామన్నారు. ఇక్కడ ఉన్న స్వచ్ఛంద సేవా సంస్థలు, ఆలయ అర్చకులు, పురోహితులు, రామ భక్తులు తప్పనిసరిగా పాల్గొన్నాలని నిర్వాహకులు కోరారు.

మలుపు వద్ద పొంచి ఉన్న ప్రమాదం



కణమాం రోడ్డు మలుపు వద్ద పలకలు విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న కాలువ

ఆనందపురం: మండలంలోని కణమాం వెళ్లే రోడ్డు మలుపు వద్ద కాలువపై పలకలు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. కణమాంకు వెళ్లే రోడ్డుని ఆరు లేన్ల రహదారికి అనుసంధానించారు. ఈ రహదారి నిర్మాణ సమయంలో రోడ్డు పొడవునా కాలువలు నిర్మించి పలకలు ఏర్పాటు చేశారు. కాగా సరిగ్గా మలుపు వద్దే కాలువపై ఉన్న పలకలు విరిగిపోయాయి. దీంతో రాత్రి వేళ రోడ్డు మలుపు వద్ద వాహన చోదకులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ కుటుంబం అదుపు తప్పి కాలువలో పడిపోయారు. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువపై పలకలు సరిచేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏయూలో ఆర్.నారాయణమూర్తి సందడి



సినీ నటుడు ఆర్.నారాయణమూర్తితో సెల్ఫీ తీసుకుంటున్న అభిమానులు

ఏయూ క్యాంపస్: విప్లవ కథలతో తనకంటూ ఒక గుర్తింపును సంపాదించుకున్న నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి బుధవారం ఆంధ్ర విశ్వ విద్యాలయాన్ని సందర్శించారు. సాయంత్రం ఆయన ఏయూ హాస్టళ్ల మీదుగా పరిపాలన భవనం నుంచి నడుచుకుంటూ వెళ్లారు. ఆయనను చూసిన నగరవాసులు కాసేపు ఫొటోలు తీసుకున్నారు. అడిగిన వారందరికీ ఆయన ఎంతో ఓర్పుగా ఫొటోలు కావాలా.. తీసుకోండి అంటూ ఆప్యాయంగా పలకరించారు.

కనకమహాలక్ష్మికి నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

నేడు పోలమాంబ అమ్మవారి పరస

ఏయూ క్యాంపస్: స్థానిక పోలమాంబ అమ్మవారి వార్షిక పరస గురువారం జరగనుంది. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో నేల వేషాలు, సాము గరిడీలు, చెక్క భజనలు, కోలాటం నడుమ పరస కోలాహలంగా సాగనుంది. గురువారం ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు అమ్మ వారికి ప్రత్యేక అభిషేకం చేస్తారు. భక్తులు రూ.216 చెల్లించి ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనవచ్చు. పరస మహోత్సవాన్ని పురస్కరించుకుని సాయంత్రం ఆలయం వెలుపల వివిధ వస్తువుల దుకాణా లు ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతారు. పెద్ద సంఖ్యలో సమీప గ్రామాల ప్రజలు హాజరై అమ్మవారిని దర్శించుకుని, పరస మహోత్సవాన్ని తిలకిస్తారన్నారు.

అప్పన్న ఆలయంలో 'స్వచ్ఛ తీర్థ'



ఆస్థాన మండపాన్ని శుభ్రం చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని అన్ని దేవాలయాల్లో స్వచ్ఛ తీర్థ అభియాన్ నిర్వహించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపం, భోగ మండపం, ఆలయ ప్రాంగణాలను శుభ్రం చేశారు. స్వామివారి పూజా సామగ్రిని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.